ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




## ఈడీ నాపై దాడులకు సిద్ధమవుతోంది
### రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనపై సోదాలకు సిద్ధమవుతోందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ సంస్థలో పనిచేస్తున్న కొందరు విశ్వసనీయ వ్యక్తుల నుంచి తనకు ఈ సమాచారం అందిందని వెల్లడించారు. సాధారణంగానే ప్రతి ఇద్దరిలో ఒకరికి తన 'చక్రవ్యూహం' ప్రసంగం నచ్చలేదని రాహుల్ పేర్కొన్నారు. ఒకవేళ ఈడీ అధికారులు సోదాలకు సిద్ధమైతే వారిని ఆహ్వానించేందుకు ..మిగతా 2లో


సంపుటి: 2 | సంచిక: 114 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 3 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు
## తెలంగాణ సాధనలో వారి పాత్ర కీలకం





### 25 వేల మందికి పదోన్నతులు కల్పించాం

- ఒకటో తేదీన జీతాలు పడేలా చేస్తున్నాం
- పేదల చదువుతోనే తెలంగాణకు భాగ్యం
- సర్కారీ బడికి వెళ్లడం ఆత్మగౌరవంగా భావించాలి
- పాఠశాలలకు ఉచిత విద్యుత్..మౌళిక వసతుల కల్పన
- ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో భేటీలో సిఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 25వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 30 వేల మందిని బదిలీ చేశాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు మీ ఖాతాలో పడేలా చూసే బాధ్యత మాది. ఈ సమ్మేళనంలో రాజకీయం, స్వప్రయోజనం లేదు. తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవం అని తల్లిదండ్రులు భావించాలి. అందుకు అందరం ..మిగతా 2లో

# త్వరలో సమగ్ర క్రీడా పాలసీ

- క్రీడాకారులను ప్రోత్సహించేలా చర్యలు
- స్కిల్ వర్సిటీ వద్దే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- బిసిసి ఆధ్వర్యంలో నిర్మించేలా భూ కేటాయింపులు
- ఉన్న స్టేడియాలను కూడా ఉపయోగించుకుంటాం
- నిఖత్ జరీన్, సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు
- బడ్జెట్‌లో స్పోర్ట్స్ కోసం రూ. 361 కోట్లు
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



హైదరాబాద్, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): తెలంగాణలో సమగ్ర స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. మాదక ద్రవ్యాలకు వారిని దూరం చేసేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. కందుకూరు మండల పరిధిలోని బేగరికంచలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పిల్లలను పుస్తకాలకు పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి స్పోర్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆలోచన చేస్తూ వివిధ సందర్భాల్లో నేను ప్రస్తావించాను. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో గచ్చిబౌలి స్టేడియంలో వివిధ రకాల క్రీడలు నిర్వహించాం. వివిధ ..మిగతా 2లో



# జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

- నోటిఫికేషన్లు..పరీక్షలు.. తేదీల వివరాలు ప్రకటన
- అసెంబ్లీలో ప్రకటించిన డిప్యూటి సిఎం భట్టి
- గతంలో అస్తవ్యస్త విధానాలతో నిరుద్యోగులకు నిరాశ
- ఇచ్చిన హామీ మేరకు ముందుకు వెళుతున్నామని వెల్లడి

హైదరాబాద్, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు ..మిగతా 2లో

### 25 శాతం మేర పెరిగిన
# రెవెన్యూ రాబడులు
### రాష్ట్ర స్థితిగతులపై కాగ్ నివేదిక విడుదల

హైదరాబాద్, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): తెలంగాణ శాసనసభలో 2023 మార్చితో ముగిసిన ఏడాదికి రాష్ట్ర స్థితిగతులపై కాగ్ నివేదిక విడుదల చేసింది. రాష్ట్ర జీఎస్‌డీపీ 2021-22తో పోలిస్తే 2022-23లో 16 శాతం పెరిగిందని అందులో పేర్కొంది. రెవెన్యూ రాబడులు గణనీయంగా 25 శాతం మేర ..మిగతా 2లో



### ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కాకుండా
# మరోచోట హైకోర్టు భవనం కట్టండి
### బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

రాజేంద్రనగర్,ఆగస్టు 2(ప్రభాత ఉదయం) రాష్ట్రానికి సంబంధించి హైకోర్టు భవనం ఆధునికంగా కడుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..కానీ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కాకుండా మరో చోట కట్టాలని కోరుతున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు.శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లును శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవసాయ భూముల్లో హైకోర్టు భవనం నిర్మించొద్దని యూనివర్సిటీ విద్యార్థులు నెల రోజుల పాటు ఆందోళన చేశారు.వ్యవసాయ విద్యాలయంలో పరిశోధనలతో ఫీల్డ్ ఎక్సపరిమెంట్ పరిశోధనలు జరగాలి.ఆ పరిశోధనలకు భూమి అవసరం.రాష్ట్ర రైతంగానికి ఉపయోగపడే విధంగా కొత్త వంగడాలు తీసుకురావాలి.కాబట్టి వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన యూనివర్సిటి భూములను తీసుకోవద్దని కోరుతున్నా.అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన 100 ఎకరాలు తీసుకుంటామన్న ఆలోచన విరమించుకోవాలి.అక్కడ ప్రొఫెసర్లు,విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు.మరో ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

### ఢిల్లీ స్టడీ సెంటర్ ఘటన
# సిబిఐ విచారణకు బదిలీ
### హైకోర్టు ఉత్తర్వులు




న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): దిల్లీలోని ఓ ఐఏఎస్ స్టడీ సెంటర్ బేస్‌మెంట్‌లో మునిగి శిక్షణ పొందుతున్న ముగ్గురు అభ్యర్థులు మృతి చెందిన కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ సిబైకి బదిలీ చేస్తున్నట్లు దిల్లీ హైకోర్టు వెల్లడించింది. ఘటన తీవ్రత, అవినీతి అధికారుల పాత్ర ఉండే అవకాశం దృష్ట్యా.. దర్యాప్తులో ప్రజలకు ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఈ దర్యాప్తు పర్యవేక్షణ కోసం సీనియర్ అధికారిని నియమించాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌ను ఆదేశించింది. ఈ సందర్భంగా దిల్లీ పోలీసులు, ..మిగతా 2లో

### ప్రయాణికులకు
# మెరుగైన సౌకర్యాలు

- తల్లుల కోసం ప్రయోగాత్మకంగా బేబీ బెర్తులు
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): ప్రయాణికులకు సురక్షిత, సౌకర్యవంత ప్రయాణం అందించేందుకు రైల్వేశాఖ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తల్లుల ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మార్చేందుకు పిల్లల కోసం బేబీ బెర్తులను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడించారు. ట్రైన్ కోచ్‌లలో బేబీబెర్త్‌లను అమర్చే అంశం ..మిగతా 2లో



# వయనాడ్ విపత్తులో 300 దాటిన మృతులు

### 49 మంది చిన్నారుల ఆచూకీ గల్లంతు
### వివరాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

తిరువనంతపురం, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 300 దాటింది. ఈ క్రమంలో 49 మంది చిన్నారుల ఆచూకీ లభించలేదని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వీరు మరణించడం లేదా గల్లంతైనట్లు విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి పేర్కొన్నారు. వరదల్లో ఓ హైస్కూల్ మొత్తం కొట్టుకు పోయిందన్న ఆయన.. అనేక భవనాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయన్నారు. 'ఇప్పటివరకు ఉన్న నివేదికల ప్రకారం.. 49 మంది చిన్నారులు మరణించడం లేదా గల్లంతయ్యారు. వెల్లరిమలలోని ఉన్నత పాఠశాల మొత్తం ధ్వంసమైంది. ముండక్కైతోపాటు పలు చోట్ల పాఠశాలలు దెబ్బతిన్నాయి. ప్రాణాలతో బయటపడిన విద్యార్థులు సర్టిఫికెట్లు, పుస్తకాలు కోల్పోయారు. వీరికి సహాయం చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి వెల్లడించారు. కొండచరియలు ..మిగతా 2లో

# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు



**మొదటి పేజీ తరువాయి...**

కలిసి కృషి చేయాలి. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తాం. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తాం.. ఆ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది. పేద పిల్లలు, దళిత వర్గాల పిల్లలు చదువుకుని బాగు పడితేనే రాష్ట్రం బలపడుతుంది. ఢిల్లీలో మూడుసార్లు కేజ్రీవాల్ గెలిచింది బస్తీల్లో పాఠశాలలు మెరుగుపరచడం వల్లే. మళ్లీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉండాలంటే మీరు పేదలకు చదువు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయు లను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు..మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేను ఈ స్థాయికి చేరా. అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలి.. విద్యార్థులకు విద్యనందించాలి. గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించాం. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# త్వరలో సమగ్ర క్రీడా పాలసీ

**మొదటి పేజీ తరువాయి...**



కారణాల చేత గేమ్స్ నిర్లక్ష్యానికి గురయ్యాయి. పుల్లెల గోపీచంద్ అకాడమీకి ల్యాండ్ ఇచ్చాం. ఆ అకాడమీ నుంచి చాలా మంది క్రీడాకరులు తయారయ్యారు. ప్రయివేటు అకాడమీలు కాకుండా ప్రభుత్వం తరపున శిక్షణ ఇస్తే అద్భుతంగా రాణించడానికి అవకాశం ఉంటుంది.. అందుకే ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో స్పోర్ట్స్ కోసం రూ. 361 కోట్లు కేటాయించాం అని రేవంత్ రెడ్డి తెలిపారు. పిల్లలను పెద్ద పెద్ద చదువులు చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారిని పుస్తకాలకే పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారు. ఆటల్లో కూడా రాణిస్తే ఉద్యోగాలు వస్తాయి.. ఉపాధి దొరుకుతుంది.. ఆ కుటుంబానికి గౌరవం కూడా లభిస్తుంది. ఈ విషయం ప్రపంచానికి తెలియజేసేందుకే నిఖత్ జరీన్‌కు, సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. ఇండ్లు కట్టుకునేందుకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో 600 గజాల చొప్పున స్థలం కేటాయించాం అని సీఎం పేర్కొన్నారు. చదవు కంటే కూడా క్రీడల్లో రాణిస్తే తప్పకుండా ఉద్యోగ భద్రత ఉంటుంది. ఇంటర్ పాసైన సిరాజ్‌కు విద్యార్హతలో మినహాయింపు ఇచ్చి ఉద్యోగం ఇచ్చాం. తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. వివిధ రాష్ట్రాల్లో స్టడీ చేసి సమాచారం సేకరించాం. హర్యానా రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కాబట్టి హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను అనుసరించాలని నిర్ణయించాం. వచ్చే సమావేశాల్లో స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తాం అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్పోర్ట్స్ స్టేడియంను నిర్మిస్తాం. రాష్ట్రంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐతో మాట్లాడుతున్నాం.. ప్రాథమిక చర్యలు పూర్తయ్యాయి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రాంతానికి న్యాక్‌ను షిఫ్ట్ చేస్తాం. బేగరికంచెలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియంను నిర్మించడానికి భూమి కేటాయిస్తాం. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐ వారు ముందుకు వచ్చారు. ఈ స్పోర్ట్స్ విషయంలో నిధుల కేటాయింపుతో పాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. ఈ రాష్ట్రంలో యువతను వ్యసనాల నుంచి బయటకు తీసుకురావలంటే స్పోర్ట్స్‌ను ప్రోత్సహించాలి. స్పోర్ట్స్ పాలసీకి సంబంధించి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తాం. కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి, సరూర్ నగర్, ఎల్‌బీ స్టేడియంలు రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ప్రపంచంలో మన పిల్లలు పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.నగరంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బేగరికంచలోని స్కిల్ యూనివర్సిటీకి సమీపంలో ఈ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనిపై బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తిచేశామన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. త్వరలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు తమ సలహాలు ఇవ్వాలని అన్నారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకురావాలంటే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే సమావేశాల్లో క్రీడలకు సంబంధించిన పాలసీ తీసుకొస్తామని.. దీనికి సంబంధించి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి అందరూ సహకరించాలని సీఎం కోరారు.

# ఈడీ నాపై దాడులకు సిద్ధమవుతోంది

**మొదటి పేజీ తరువాయి...**

సిద్ధంగా ఉన్నట్టు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. కేంద్ర బడ్జెట్ 2024-25పై లోక్‌సభలో చర్చ సందర్భంగా సోమవారం ప్రసంగించిన రాహుల్ గాంధీ ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని పద్మవ్యూహంలోకి నెట్టివేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాభారతంలోని కురుక్షేత్ర సంగ్రామంలో కీలక ఘట్టమైన పద్మవ్యూహాన్ని, వీరమరణం పొందిన అభిమన్యుడిని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా, మరికొందరిపై రాహుల్ గాంధీ విమర్శలు సంధించారు. అభిమన్యుడిని చక్రవ్యూహంతో ఆరుగురు ఎలా హత్య చేశారో, ఇప్పుడు దేశాన్నీ అదే చేయబోతున్నారని వ్యాఖ్యానించారు. యువత, రైతులు, మహిళలు, చిన్న, మధ్య తరహా వ్యాపారుల చుట్టూ, దేశంలోని ఆరుగురు వ్యక్తులు చక్రవ్యూహాన్ని పన్నుతున్నారని రాహుల్ ఆరోపించారు. రాజకీయ, వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడమే కేంద్ర బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశాన్ని బంధించిన చక్రవ్యూహం వెనుక మూడు శక్తులు ఉన్నాయన్నారు. దేశ సంపద మొత్తాన్ని కబళించాలని చూస్తున్న ఇద్దరు వ్యక్తులు మొదటి శక్తి కాగా, దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ రెండోదని అన్నారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గాన్ని మూడో శక్తిగా రాహుల్ అభివర్ణించారు. ఇవి దేశాన్ని విధ్వంసం చేస్తున్నాయని దుయ్యబట్టారు.

### వయనాడ్ ఘటన ఒక జాతీయ విపత్తు - రాహుల్

కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి భారీ ఎత్తున ప్రాణ నష్టం సంభవించడం తనను ఎంతో బాధించిందని, కుటుంబ సభ్యులను, ఇళ్లను కోల్పోయిన వారి బాధ కలచివేస్తోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇది జాతీయ విపత్తని ఆయన అభివర్ణించారు. వెంటనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పునర్నిర్మాణం చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాహుల్ తన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీతో కలిసి గురువారం కొండ చరియలు విరిగిపడిన చూరాల్‌మలలో పర్యటించారు.



# వయనాడ్ విపత్తులో 300 దాటిన మృతులు

**మొదటి పేజీ తరువాయి...**

విరిగిపడిన ఘటనలో అనేక మంది ఆచూకీ లేకుండా పోయింది. వీరికోసం రెస్క్యూ బృందాలు ప్రతికూల వాతావరణంలోనూ తీవ్రంగా గాలిస్తున్నాయి. ఇప్పటివరకు 200లకుపైగా మృతదేహాలకు పోస్టుమార్టం చేసినట్లు సమాచారం. కాగా మరో 218 మంది ఆచూకీ గల్లంతైనట్లు వయనాడ్ జిల్లా అధికారులు వెల్లడించారు. 94 రిలీఫ్ క్యాంపుల్లో దాదాపు 10వేల మందికి పునరావాసం కల్పిస్తున్నట్లు చెప్పారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి...**

అధికారంలో ఉన్నా, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దు అయిందని, ఉద్యోగాల భర్తీ పక్రియ గందరగోళంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ లతో రెండు కమిటీలు ఏర్పాటు చేసి, వారి సూచనల్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి, 60 కొత్త పోస్టులతో మొత్తం 563 పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 3 లక్షల మంది హాజరుకాగా, పరీక్ష సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించామన్నారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక లక్షా 45 వేల 368 మంది హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఎగ్జామ్ కు 1 లక్షా 6 వేల 2 వందల 60 మంది హాజరుకాగా, విజయవంతగా నిర్వహించాం. 32 వేల 4 వందల 10 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చాం. 11 వేల 62 ఖాళీలతో టీచర్ రిక్రూట్ మెంట్ కోసం డీఎస్సీ ఎగ్జామ్ ప్రకటించాం. జులై 18న ప్రారంభమై ఆగస్టు 5న ముగియనున్నాయి. 465 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీకి, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. పరీక్షల ప్రిపరేషన్ కు తగినంత సమయం లేదని అభ్యర్థులు కోరడంతో ఆగస్టు నుంచి డిసెంబర్ కు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశాం. పరీక్షా తేదీలు ఒకటే కాకుండా, పరీక్షల మధ్య ప్రిపరేషన్ కు సమయం ఉండేలా అన్ని నియామక బోర్డులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాయని భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల పేపర్లు లీకయ్యాయి, పేపర్ల అమ్మకంతో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీక్ కారణంగా 2023 మార్చి 17న తొలిసారి గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దయింది. అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకోని కారణంగా హైకోర్టులో రెండోసారి ఎగ్జామ్ రద్దు అయింది. ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, కొత్త ఛైర్మన్ ను నియమించి వరుసగా పోస్టుల భర్తీని పూర్తి చేశాం. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎగ్జామ్స్ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నామని' భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇకపోతే షెడ్యూల్ ప్రకారం..వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ట్రాన్స్‌కోలోని వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు చేపడతారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు చేపడతారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జులైలో నిర్వహించ నున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు జరుపుతారు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు చేపడతామని ప్రకటనలో వివరించారు.

# 25 శాతం మేర పెరిగిన రెవెన్యూ రాబడులు

**మొదటి పేజీ తరువాయి...**

పెరిగాయి. రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఒక శాతం తగ్గింది. సొంత పన్నుల రాబడి గణనీయంగా 17 శాతం పెరిగింది. సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగింది. 2023 మార్చి నాటికి పూర్తి కావాల్సిన 20 ప్రాజెక్టుల అంచనా వ్యయం పెరిగింది. రూ.2,749 కోట్ల మేర ద్రవ్యలోటు తక్కువ చేసి చూపించారు. 2022-23లో ప్రభుత్వం ఇచ్చిన రుణాలు, అడ్వాన్సులు 150 శాతం మేర పెరిగాయి. సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు ఏర్పాటు చేసింది. 2022-23 బ్జడెట్ వెలుపలి రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా. ఆయా రుణాలకు ప్రభుత్వం తదుపరి రుణాలుగా రూ.17,829 కోట్లు అందించింది. రాష్ట్రాభివృద్ధి రుణాలపై వడ్డీపై ఖర్చు తక్కువగా అంచనా వేస్తున్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లను భారీగా అంచనా వేస్తున్నారు. ఏపీ నుంచి తెలంగాణ విద్యుత్ కంపెనీలకు బకాయిలు రాలేదు. ఇళ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌పామ్ పథకాల నిధులు ఖర్చు కాలేదు. దళితబంధు, రుణమాఫీ పథకాలకు కేటాయింపుల్లో భారీగా ఖర్చు కాలేదు' అని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

# ఢిల్లీ స్టడీ సెంటర్ ఘటన సిబిఐ విచారణకు బదిలీ

**మొదటి పేజీ తరువాయి...**

మున్సిపల్ అధికారులు చెప్పిన సమాధానాలపై హైకోర్టు మండిపడింది. మౌలిక సదుపాయాల గురించి పట్టించుకోకపోవడం మున్సిపల్ అధికారులకు అలవాటుగా మారిందని ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులు ఎలా బయటకు రాలేకపోయారనే విషయం అర్థం కావడం లేదంటూ పోలీసులు, మున్సిపల్ అధికారులు చెప్పడంపై హైకోర్టు ధర్మాసనం మండిపడింది. ఈ కేసులో ఎస్‌యూవీ డ్రైవర్‌ను అరెస్టు చేయడంపైనా తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'ఇంకా నయం.. ఘటన జరిగిన ప్రాంతంలో వాహనం నడిపినందుకు కారు డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లుగా.. బేస్‌మెంట్‌లోకి వరద వచ్చిందని చెప్పి వర్షపు నీటికి చలాన్ వేయలేదు' అంటూ అధికారుల తీరుపై పెదవి విరించింది. కోచింగ్ సెంటర్ ఘటన దర్యాప్తును సీబీఐకి అప్పగించడాన్ని ఆందోళన చేస్తోన్న సివిల్స్ అభ్యర్థులు స్వాగతించారు. ఈ చర్యతోనైనా వాస్తవాలు బయటకు వస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. అయితే, ఘటన సమయంలో లైబ్రరీలో ఎంతమంది ఉన్నారన్న దానిపై సమాచారం లేదని.. ఈ వివరాలు బయటకు వెల్లడించాలని డిమాండు చేశారు.

# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రభుత్వ పరిశీలనలో ఉందా..? అని భాజపా ఎంపీ సమర్ సింగ్ సోలంకీ ప్రశ్నించారు. దానికి మంత్రి స్పందిస్తూ.. 'లఖ్‌నవూ మెయిల్‌లో రెండు బేబీ బెర్త్‌లను ప్రయోగాత్మకంగా తీసుకువచ్చాం. లఖ్‌నవూ మెయిల్‌లోని ఒక కోచ్‌లో రెండు దిగువ బెర్త్‌లకు వాటిని అమర్చాం. దీనిపై వచ్చిన ఫీడ్‌బ్యాక్‌లో ప్రశంసలు అందాయి. అయితే సామాన్లు పెట్టుకునే స్థలం తగ్గిపోవడం, సీట్ల మధ్య దూరం తగ్గడం వంటి సమస్యలు మా దృష్టి వచ్చాయి. ప్యాసింజర్ కోచ్‌లలో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతుంటాయి. అది నిరంతర పక్రియ' అని మంత్రి వెల్లడించారు. బేబీ బెర్తులు.. పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చిన్నపాటి పడకలు. లోయర్ బెర్త్‌కు అటాచ్ అయి ఉంటాయి. ప్రయాణ సమయంలో తల్లులు ఈ బెర్త్‌పై తమ చిన్నారులను పడుకోబెట్టుకోవచ్చు. సాధారణంగా అయితే.. ఒకే బెర్త్‌పై తల్లీబిడ్డా సర్దుబాటు కావాల్సి ఉంటుంది. దీంతో స్థలం సరిపడక.. ఇబ్బందులు తప్పేవి కావు. ఇప్పుడు బేబీ బెర్త్ సాయంతో పిల్లల్ని తమ పక్కనే సురక్షితంగా పడుకోబెట్టొచ్చు. అవసరం లేనప్పుడు దీన్ని లోయర్ బెర్త్ కిందికి మడతపెట్టొచ్చు. శిశువును సురక్షితంగా ఉంచడానికి పట్టీలూ ఉన్నాయని గతంలో అధికారులు వెల్లడించారు.

# మార్పు పేరుతో ప్రజలను ఏమార్చలేరు

**జాబ్ క్యాలెండర్ పేరుతో మరోమారు మోసం**
**ఉద్యోగాలు ప్రకటించకుండానే నిరుద్యోగుకలు మోసం**
**ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది**
**గన్‌పార్క్ వద్ద నిరసనలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్**



హైదరాబాద్, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం): మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు. ఈ విషయం మీకు కూడా తెలుసని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు.. అయినా కూడా పిల్లల్లో ఉద్యేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి, శాసనభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన పద్ధతిలో నిన్న, మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు.. ఎక్కువ రోజులు డ్రామా నడవదని స్పష్టం చేశారు. ఈ ఐదారు రోజుల శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గవర్నమెంట్‌లో విషయం లేదు.. కేవలం ఊదరగొట్టే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేవని తేలిపోయిందని కాబట్టే ఈ బజారు భాషతో మమ్మల్ని రెచ్చగొడు తున్నారని తెలిపారు. మంచిగా మాట్లాడుతుంటే కావాలనే ఉసిగొల్పి ప్రజల దృష్టి మరల్చే ఒక చీప్ టాక్టిక్స్‌కు చేస్తున్నారని మండిపడ్డారు. ఈయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిగా పైశాచిక ఆనందం పొందుతూ.. ఆడబిడ్డలను అవమానిస్తూ.. ఎమ్మెల్యేలను బూతులు తిట్టిస్తూ ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అందుకే అసెంబ్లీలో నిరసన చెప్పి బయల్దేరి గన్‌పార్క్ వద్దకు వచ్చి.. మా శాసన సభ్యులు, మండలి సభ్యులు అందరం వచ్చి మా నిరసన చెబుతున్నామని పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్ మీద కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్దాలు చెబుతుందని కేటీఆర్ మండిపడ్డారు. ఆ విషయంలో కూడా తప్పకుండా ప్రభుత్వాన్ని తూర్పార పడుదామని అనుకున్నామని చెప్పారు. కానీ బజారు భాషలో మాట్లాడేసరికి మా అక్క కోవ లక్ష్మి దుఃఖం ఆపుకోలేక.. తమను బయటకు తీసుకొచ్చారని తెలిపారు. ఈ శాసనసభలో తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే ముచ్చట్లు లేవని.. కేవలం కాంగ్రెస్ పార్టీ డ్రామాలు, కాంగ్రెస్ పార్టీ నాటకాలు తప్ప ఏమీ లేవని మండిపడ్డారు. అప్పులు, అప్పులు అని ఇన్ని రోజులు తప్పుడు కూతలు కూశారని చెప్పారు. అప్పులు లేవు.. ఈ రాష్ట్రం రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్ అని మేం ఎస్టాబ్లిష్ చేస్తే ఇవాళ నోరు మూసుకున్నారని తెలిపారు. అనేక విషయాలను డైవర్ట్ చేయడానికే మా అక్కల మీద నోరుపారేసుకుని.. కావాలని ప్రజల దృష్టి మరల్చే ఓ చిల్లర ప్రయత్నం చేస్తున్నాడు.. ఈ చిల్లర ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని గ్రహించాలని తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలని అడిగితే రెండు నిమిషాలు కూడా టైమ్ ఇవ్వలేదన్నారు. నాలుగు పేపర్ల మీద ఇష్టం వచ్చింది రాసుకొచ్చి జాబ్ క్యాలెండర్ అంటున్నారని విమర్శించారు. తెలంగాణ శాసనసభ దుశ్శాసనసభగా మారిందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి కాంగ్రెస్ గెలిచింది. అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటనలు చేశారు.

# నేడు విద్యుత్ లేని ప్రాంతాలు



రాజేంద్రనగర్, ఆగస్టు 2(ప్రభాత ఉదయం) శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్ ప్రైస్, ఖాద్రి హిల్స్, శ్రీదేవి కాలనీ, భవాని కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 నుండి 11:30 వరకు భవాని కాలనీ ప్రేమావతి పేట, చింతల్ మెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు వాదేఈ సులేమాన్ నగర్ అక్బర్ హెల్త్ మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు బాసిత్ బాబా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో చింతల్ మెట్, లిక్బగ్ ఫంక్షన్ హాల్ ప్రాంతం, బాసిత్ బాబా నగర్ ప్రాంతం మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు ఆదర్శనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదర్శనగర్, మంజుబార్ ,ఆరంఘర్ పిస్తా హౌస్ ,కింగ్స్ సరీనా, లక్ష్మీనారాయణ విల్లాస్, మెట్రో కన్వెన్షన్ ,శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ, నేషనల్ పోలీస్ అకాడమీ, ప్రభుత్వ పాఠశాల ప్రాంతాలు 11:30 నుండి 1:00 వరకు హాసన్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో హసన్ నగర్ శివరాంపల్లి మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకు శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ కాలనీ ,వీకర్ సెక్షన్ కాలనీ, ప్రభుత్వ పాఠశాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ చారి తెలిపారు.

### కిస్మత్పూర్ లో...

కిస్మత్పూర్ విద్యుత్తు సబ్ష్టేషన్ పరిధిలో వివిధ మరమత్రా నిమిత్తం శనివారం శ్రీ సాయి కాలనీ ప్రభుత్వ పాఠశాల రాఘవేంద్ర కాలనీ ఫైన్ హార్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాల్టీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ హైూంనగర్ కాలనీ ఎస్ ఎంక్లేవ్ 1,2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కృతి విల్లాస్ ప్రాంతాలలో ప్రవేట్ పనుల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు ఎల్వీ ప్రసాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో కే టి టి కాలనీ, శ్రీ బాలాజీ ఎంక్లేవ్, రాజా క్షేత్ర, గిరి దారి, గిరిదారి విష్ఠ, దర్గా ఖలిస్తన్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్, కీర్తి విల్లాస్, నమః, మ్యాప్ హార్ కన్స్ట్రక్షన్ 80 యడ్స్, 60 యాడ్స్ను, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

### హిమాయత్ సెక్షన్ పరిధిలో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని హైదర్ షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్ నగర్, తిరుమల గార్డెన్, రాధా రియాట్ ఫేస్ టు, పావని హార్మోనివిల్లాస్, బచ్పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్, ప్రాంతాలలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, స్నేహిత హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు స్నేహిత హిల్స్ ఫేస్ వన్, 2 ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఇబ్రహీంబాద్ విద్యుత్ సబ్ష్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు మ్యాప్ లే టౌన్, విశ్వాస్ టౌన్, మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు పి అండ్ టీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో స్నేహిత విద్యుత్ ఫీడర్ పరిధిలో పి అండ్ కాలనీ , ఏ బి సి డి, స్పెషల్ బ్లాక్, సన్ సిటీ కీర్తి రిచ్మండ్ విల్లాస్, ప్రాంతాలలో, మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకు ఖాళీ మందిర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో బైరాగి గూడ, శివపురి, శివ సాయి నగర్ ఫేస్ వన్, టూ, సుబ్రహ్మణ్య కాలనీ, వాల్మీకి నగర్, సంఘం సిటీ, గంధం గూడ, ఇండస్ వ్యాలీ, సాయి బాలాజీ నగర్, సంజయ్ గాంధీ నగర్ ప్రాంతాలలో వివిధ పనుల నిర్వహణ నిమిత్తం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

### మైలర్ దేవ్ పల్లి సెక్షన్ పరిధిలో...

మైలార్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 11:00 నుండి 11:30 వరకు క్రిస్టల్ టౌన్, మిల్లత్ నగర్, జహంగీరాబాద్, వాదేయి ఫర్హాన్, బండ్లగూడ విద్యుత్తు ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు వినాయక నగర్, అలీ నగర్, అయేషా కాలనీ, అహమ్మద్ నగర్, ప్యాలెస్ వ్యూ కాలనీ, కింగ్స్ ఎవెన్యూ, అబ్దుల్లా కాలనీ, రెహమత్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు గాంధీనగర్, పటేల్ నగర్, హరిజన్ బస్తి, రెహమత్ కాలనీ, బండ్లగూడ విలేజ్, అబ్దుల్లా కాలనీ, క్రిస్టల్ టౌన్షిప్, తులసి నగర్, వాదేయి ఫర్హాన్, సుభాన్ హిల్స్, హాశమాబాద్, 18, 19 వార్డు దస్తగిరి నగర్, ప్రాంతాలలో పెద్ద సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

### కాటేదాన్ ప్రాంతంలో...

నేషనల్ పోలీస్ అకాడమీ విద్యుత్ సబ్ష్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30, కింగ్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు హసన్ నగర్, సాయిబాబా నగర్ శాస్త్రి పురం, కింగ్స్ కాలనీ, రిజ్వాన్ కాలనీ, సాయిబాబా నగర్, రాఘవేంద్ర కాలనీ, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శాస్త్రి పురం విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్ తెలిపారు.

### నార్సింగి సెక్షన్ పరిధిలో...

నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలోని వాసవి విద్యుత్ ఫీడర్ , అక్షయపాత్ర విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు బృందావన్ కాలనీ, ఎన్సిసి అర్బన్, వెస్టిండ్ మే డేఓస్, కోకాపేట్, వెరైటీస్ పనాచే, వైయస్సార్ కాలనీ, పాషా కాలనీ, అలిజాపూర్, వెంకటేశ్వర కాలనీ, పరిసర ప్రాంతాలు, మిలిటరీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు రాందేవ్ గూడ, నేక్నాపూర్, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, ఇవేవీ కాలనీ, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు.

### మణికొండలో...

ఇబ్రహీం విద్యుత్ సెక్షన్ పరిధిలోని పీజీ కాలేజ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:00 నుండి 11:30 వరకు డోలార్ హిల్స్, తిరుమల హిల్స్, బయోత్ నగర్, పీజీ కాలనీ, లాంకో విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 1 నుండి 13 వరకు, జనచైతన్య ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి మూడు గంటల వరకు జన చైతన్య కాలనీ ,పంచవటి కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ గా బాధ్యత లు స్వీకరించిన అమ్మిశెట్టి అరవింద్ బాబు కు రాజేంద్రనగర్ కు చెందిన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. క్రాంతి అసోసియేట్స్ ఆఫీస్ సిబ్బంది శాలువ పుష్పగుచం తో స్వాగతం పలికారు . అనంతరం శుభాకంక్షాలు తెలియజేసారు . సదానంద్ అసోసియేట్స్ డాక్యుమెంట్ రైటర్ క్రాంతి , ఆఫీస్ ఆపరేటర్ సంపత్ , మల్లేష్గ గౌడ్ లు ఉన్నారు. గతంలో రాజేంద్రనగర్ లో పని చేసిన సబ్ రిజిస్ట్రార్ టి.శృతి సబ్ వల్లభ నగర్ కు బదిలీ అయ్యారు.



రాజేంద్రనగర్ లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాదిగ, మాదిగ ఉప కులాల జర్నలిస్టులు

## 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట విజయం

**ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పుతో హర్షం వ్యక్తం చేసిన రాజేంద్రనగర్ జర్నలిస్టులు**

బుద్వేల్, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం):ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అవకాశం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మాదిగ, మాదిగ ఉపకులాల జర్నలిస్టులు శుక్రవారం రాజేంద్రనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఎ.భీమయ్య , పి. వెంకటేష్ లు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని గత 30 సంవత్సరాలు గా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎన్నో అలుపెరుగని పోరాటాలు జరిగాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఏబీ సీ డీ వర్గీకరణ చేపట్టి 59 ఉపకులాలకు మేలు చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇది ప్రతి మాదిగ, మాదిగ ఉప కులాల విజయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎం. బాలసుబ్రమణ్యం, కె.నరసింహ, అంజి బాబు యు. శ్రీకాంత్, రవికుమార్, రాజు, రామకృష్ణ, ఎం. బాలమురళీకృష్ణ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



మిఠాయిలు తినిపించు కుంటున్న జర్నలిస్టులు

## వ్యక్తిని హతమార్చిన ఘటనలో నిందితుడు అరెస్ట్

రాజేంద్రనగర్,ఆగస్టు2 (ప్రభాత ఉదయం) ఓ వ్యక్తిని హతమార్చిన ఘటనలో నిందితుడిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..క్రెసెంట్ అవెన్యూ సొసైటీలోని ఓపెన్ ప్లాట్లో నిందితుడు చనిపోయిన మైకాల వేణుబాబు అలియాస్ రేణుబాబు, రాజేంద్రనగర్ కిస్మత్పూర్ ఇందిరమ్మ కాలనీకి చెందిన దవాన్కర్ సాయి వర్షిత్(19) లకు మధ్య కుటుంబ వివాదాలు కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో సాయి వర్షిత్ను రేణుబాబు వేధిస్తున్నాడు.దీంతో రేణుబాబును హతమార్చాలని నిర్ణయించుకున్నాడు.కాగా కాళికా మందిర్ దేవాలయం సమీపంలోని వైన్ షాప్ దగ్గరకు వెళ్లి మృతుడు రేణుబాబు రోడ్డుపై పడి ఉన్నాడని గుర్తించాడు.వేణుబాబు తన వాహనంపై మృతుడిని ఎక్కించుకుని క్రెసెంట్ అవెన్యూ సొసైటీలోని ఓపెన్ ప్లాట్లోకి వెళ్లాడు.నేలపై పడి అతని తలపై బండరాయిని విసిరి చంపాడు.కాగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడి నుంచి మోటార్ సైకిల్,మొబైల్ ఫోన్, రక్తంతో తడిసిన చొక్కాను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు రిమాండ్కు తరలించారు.



తల్లి పాల వారోత్సవాలలో పాల్గొన్న మాతృ మూర్తులు

## తల్లికి మించిన దైవం లేదు

**అమ్మ పాలకు మించిన అమృతం లేదు**

బుద్వేల్, ఆగస్టు2(ప్రభాత ఉదయం): తల్లిపాలు శ్రేష్టమైనవి శేరిలింగంపల్లి ఐసీ డీ ఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ పద్మజ, మెడికల్ ఆఫీసిర్ వందన పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాలో బాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ శేర్లింగంపల్లి ప్రాజెక్ట్ మైలర్ దేవ్ పల్లి సెక్టార్ బాబుల్ రెడ్డి నగర్, వినాయక నగర్ అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం టీచర్లు కనకవ్వ, అనిత ల అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు... బిడ్డ కు తల్లి పాలు వలన ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. తల్లి పాలు ఇవ్వడం తల్లి బిడ్డ ఇద్దరికి ఉపయోగం అన్నారు. బిడ్డ పుట్టిన గంట లోపే తల్లి పాలు ఇవ్వడం ప్రారంభించాలన్నారు. ఆ పాలు బిడ్డకు తొలి ఆహారం అన్నారు. బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లి పాలే ముఖ్యంమన్నారు .ఈ విషయం లో చాలా మంది తల్లులు నిర్లక్ష్యం చేస్తున్నారని గుర్తు చేశారు. ఫలితంగా పిల్లలు రక్త హీనత ఇతర వ్యాదులతో బాధ పడుతున్నారన్నారు. ఆధునిక సమాజం లో చాలా మంది బిడ్డకు పాలు ఇవ్వడం లేదని, కొంత మంది తల్లులు శారీరక సౌదర్యం తగ్గుతుందనే అపోహాలో ఉన్నారన్నారు. దీనిపై అవగాహన పెంచాలనే ఉద్దేశం తొ ఆగస్టు 1 నుండి 7వ తేది వరకు తల్లి పాల వారోత్సవాలు వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తుందన్నారు .తల్లి పాలు శిశువుల ఆరోగ్యం పై చాలా ప్రభావం చూపుతాయన్నారు. ఈ విషయాని తెలుసుకోకుండా చాలా మంది తల్లులు బిడ్డకు డబ్బా పాలపై మోజు పెంచుతున్నారన్నారు. పుట్టిన బిడ్డకు గంట లోపే కచ్చితంగా తల్లి పాలు ఇవ్వాలన్నారు. అలా పాలు ఇచ్చి నందు వలన బిడ్డ ఆరోగ్యానికి , ఎదుగుదలకు ఎంతో శ్రేయస్కరమని వారు తల్లులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ గౌరీ , ఏఎన్ఎం ప్రేమా దేవి, భాగ్య, ఆశ వర్కర్లు సరిత, రేణుక, మంగ తదితరులు పాల్గొన్నారు

## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం సంతోషకరం

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఐదు సంవత్సరాల పాటు ఎస్సీ రిజర్వేషన్ల ను ఏ బీ సీ డీ లుగా వర్గీకరించి అమలు చేసింది అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



మ్యాడం రామేశ్వర్ రావు

బుద్వేల్, ఆగస్టు2(ప్రభాత ఉదయం): ఎస్సీ రిజర్వేష న్లను ఏబీసీడీ లు గా వర్గీకరించి అమలు చేసుకోవచ్చని ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తూ సుప్రీంకోర్టు గురువారం తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గదని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం రామేశ్వర రావు అన్నారు. అమెరికా లోని ఫీలదెల్ఫియా స్టేట్ లో కుమారుడు డాక్టర్ రాహుల్ మ్యాడం దగ్గర ఉన్న రామేశ్వర్ రావు వాట్సప్ కాల్ ద్వారా ప్రభాత ఉదయం ప్రతినిధి తో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ను 2000 నుంచి 2004 సంవత్సరం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో కొందరు సుప్రీంకోర్టు కు వెళ్లగా వర్గీకరణ వద్దని కొట్టి వేశారని, పార్లమెంటు లో చట్టం చేయాలని చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. నేటి సుప్రీంకోర్టు తీర్పు సంతోషాన్నిచ్చిందని, అందుకు ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం చేసిన కృషి అభినందించదగినదన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలకు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కు, నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.



డ్రైనేజీ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది పనితీరు ను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

## పొంగిపొర్లుతున్న మురుగునీటి సమస్యల నివారణకు తక్షణ చర్యలు

బుద్వేల్, ఆగస్టు2(ప్రభాత ఉదయం): మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీలో పొంగిపొర్లుతున్న మురుగునీటి సమస్య నివారణకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సివరేజీ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ వి. రేణుక అన్నారు. కొత్తగా మైలార్ దేవ్ పల్లి సెక్షన్ మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ సాజీద్ అలీ సమస్యను డీ జీ ఎం వి. రేణుక దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆమె వెంకటేశ్వర కాలనీ లో పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర కాలనీలోని ఆదిత్యా స్కూల్ ముందు పొంగిపొర్లుతూ ఆ వెనుక వైపు ఉన్న ఓపెన్ ప్లాట్లలో మురుగు నీరు నిల్వ ఉన్న విషయాన్ని స్థానిక ప్రాంత ఇంచార్జి వినోద్ డీజీఎం దృష్టికి తీసుకువెళ్లారు. సగం మేర వేసి వదిలే సిన సీసీరోడ్డు కారణంగా కూడా పైప్ లైన్ వ్యవస్థ, మ్యాన్ హోల్స్ అస్తవ్యస్థంగా మారడానికి కారణమని డీజీఎం రేణుక గుర్తించారు. దాంతో యుద్ధ ప్రాతిపధికన మురుగునీరు తరలింపుతోపాటు కూలిపోయిన, అస్తవ్యస్థంగా ఉన్న మ్యాన్ హోల్స్ ల మరమత్తులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు ప్రారంభించే వరకు అక్కడే ఉండి సిబ్బందికి మురుగునీరు లీకేజీ కాకుండా ఓవర్ లోడ్ నివారిస్తూ పైప్ లైన్లు ఏ విధంగా అనుసంధానం చేస్తూ మ్యాన్ హోల్స్ నిర్మించాలో సూచించారు. కాంట్రాక్టర్ చంద్రయతో పాటు వర్క్ ఇన్స్పెక్టర్ మహ్మద్ జియావుద్దీన్, సూపర్వైజర్ వినోధ్ ను ఆయా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీఎం రేణుక మాట్లాడుతూ, వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాని సూచించారు. మురు గునీరు, వర్షం నీరు నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ పైప్ లలో చేరే విధంగా వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ప్లాస్టిక్ సంచులు, చిన్నారులకు ఉపయోగించే డైపర్లు, ఇతర కొన్ని రకాల వ్యర్థాలు డ్రైనేజీ పైప్ లైన్ ల లో చేరడంవల్ల మురుగునీరు సాఫీగా సాగక పొంగిపొర్లే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. మురుగు నీటి తరలింపు పైప్ లైన్ వ్యవస్థలో ఏర్పడే సమస్యలకు తక్షణ పరిష్కారం కోసం హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్ బి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.బస్తీల్లో నిర్మాణాలు చేసే వారు నిర్మాణ సామాగ్రి సమకూర్చుకునే ప్రయత్నంలో భారీ వాహనాలను తీసుకురావడం వల్ల మ్యాన్ హోల్స్ దెబ్బతిని కుంగిపోతున్నట్లు గుర్తించడం జరిగింద న్నాడు. మ్యాన్ హోల్స్ పైనుంచి భారీ వాహనాలు తీసుకువచ్చి కూలిపోయేలాగా చేసే వారి పై శాఖ పరంగా చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని ఆమె హెచ్చరించారు.

## లక్ష్మీగూడ ఎర్ర కుంట క్రింది భాగంలో అక్రమంగా గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్న గోదాములోని 117 వంట గ్యాస్ సిలిండర్లు సీజ్

బుద్వేల్, ఆగస్టు2(ప్రభాత ఉదయం): మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ లక్ష్మీ గూడ ఎర్ర కుంట క్రింది భాగం లో ఓ గోదాంలో అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ కేంద్రంపై పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 117 వంట గ్యాస్ సిలిండర్ లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వంట గ్యాస్ సిలిండర్లు తీసుకు వచ్చి వాటిలోని గ్యాస్ ను కమర్షియల్ సీలందర్లలోకి రీ ఫిల్లింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా సరూర్ నగర్ సర్కిల్ ఏ ఎస్ ఓ బాల సరోజ మాట్లాడుతూ గత కొంతకాలంగా సర్జిత్ అనే వ్యక్తి డబ్బులకు ఆశపడి డొమెస్టిక్ సిలిండర్లను ప్రజల వద్ద తీసుకొని వాటిని కమర్షియల్ సిలిండర్లలో గ్యాస్ నింపుతూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి బాలసరోజా హెచ్చరించారు. 117 సిలందర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



లక్ష్మీగూడ ఎర్ర కుంట వద్ద అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ స్టేషన్ను తనిఖీ చేస్తున్న ఏ ఎస్ ఓ బాల సరోజ

### లక్ష్మీగూడ ఎర్ర కుంట చెరువు క్రింది భాగంలో అన్ని అక్రమ కంపెనీ లే

లక్ష్మి గూడ ఎర్రకుంట కింది భాగంలో అన్ని అక్రమ కంపెనీలే ఉన్నాయని ప్రజలు పోతున్నారు . ప్రతి వస్తువు అక్కడ తయారవుతుందని గుర్తు చేస్తున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ నాసికమైన వస్తువులను తయారు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని గుర్తు చేశారు. లక్ష్మి గూడ ఎర్ర కుంట చెరువు కింది భాగంలో ఉన్న గోదాములలో అన్ని శాఖల అధికారులు సోదాలు చేయాలని అన్నారు.



లక్ష్మీగూడ ఎర్ర కుంట వద్ద అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ గోదాము

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి

**రాజీపడే ప్రసక్తే లేదని,అభివృద్ధి**

**తన ప్రథమ కర్తవ్యం.. తోకల శ్రీనివాస్ రెడ్డి**



రాజేంద్రనగర్,ఆగస్టు 02(ప్రభాత ఉదయం) ప్రజా సమస్యల పరిఫష్కారం కోసం నిరంతరం కృషిచేస్తానని రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే, మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని దుర్గనగర్,హౌసింగ్ బోర్డు,టీఎన్జీవోస్ కాలనీలలో జిహెచ్ఎంసి, జలమండలి అధికారుల బృందంతో కలిసి పర్యటించి తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఇంటింటికి విస్తృతంగా తిరుగుతూ కాలనీ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కాలనీలో సిసి రోడ్డు,భూగర్భ డ్రైనేజి,విద్యుత్ దీపాల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు.ఈ సందర్బంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఓపికగా అన్ని సమస్యలు విన్నారు.డివిజన్ సమస్యలను లేకుండా చేయాలన్నదే తన ధ్యేయం అన్నారు.అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఎక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమాచారం అందిస్తే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు.పారిశుధ్య పనులను సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.అధికారులు కూడా సమస్యలను వెనువెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు.బస్తీల ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని,డివిజన్ పరిధిలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నాయకులు,కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు.కాలనీల్లో,బస్తీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీపడే ప్రసక్తే లేదని,అభివృద్ధి ప్రథమ కర్తవ్యం అని అన్నారు.కాలనీలో తాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా కాలనీలో నెలకొన్న విద్యుత్,పారిశుధ్య సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి నాయకులు భార్గవ్ పంతులు, బబ్లూ,బొమ్మారాజు నరసింహ,పృథ్వీరాజ్,తలారి చిన్న,మధుసూదన్ రెడ్డి,వెంకట రమణ,నగా భూషణ్,రమేష్,వీరేష్,మధునాయక్,ప్రత్యూష్, రాజు కుమార్,మల్లికార్జున్,జలమండలి మేనేజర్ సాదిక్,వర్క్ వర్క్ ఇన్స్పెక్టర్ జియా,ఎం.వినయ్ కుమార్,జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ హరీష్ మహేందర్,బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఆ గ్రామానికి ఏమైంది?

**13 రోజుల్లో వ్యవధిలో 11 మంది మృతి**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2(ప్రభాత ఉదయం)ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఈ గ్రామంలో సంభవించిన వరుస మరణాలు గ్రామస్తులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కేటిదొడ్డి మండలం కొండాపురంలో గ్రామంలో వరుస మరణాలతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. జూలై మాసంలో 13 రోజుల్లో వ్యవధిలో 11 మంది మృతి చెందడం కలకలం రేపుతోంది. గత నెల 20 నుంచి 31 వరకు మొత్తం 11 మంది మృతి చెందారు. చిన్న పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు చిన్న, పెద్ద తేడా లేకుండా వివిధ కారణాలతో మరణించారు. అనారోగ్యంతో కొందరు, ప్రమాదవశాత్తు కొందరు, ఆత్మహత్యతో ఒకరు మృతి చెందుతుండటంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. గోవిందు, వడ్డే సవారమ్మ వృద్ధాప్య సమస్యలతో మృతి చెందగా గోపాల్ అనే వ్యక్తి గుండెపోటుతో, వడ్డే నరసింహులు కరెంటు షాక్ తో, సావిటికాడి సవారమ్మ, గురమ్మ, మన్యపు రెడ్డి, సాలప్ప, రఘు వేర్వేరు కారణా లతో మృతి చెందారు. ఈ మరణాలు మరవక ముందే గ్రామానికి చెందిన యువకుడు ప్రసాద్ హైదరాబాద్ లో బుధవారం సూసైడ్ చేసుకున్నాడు. ఈ మరణాలు ఇలాగే కొనసాగుతాయా? ఇప్పుడు అందరినోట నానుతొంది. వరుస మరణాలు కలవరపెడుతున్నా యని, దీని నివారణ కోసం గ్రామస్తులమంతా హోమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గ్రామంలో వరుస మరణాలతో గ్రామానికి ఏదో గాలి ఆవహించిదని ప్రచారం జరుగుతోంది. దాంతో గ్రామస్తుల్లో ఎవరూ చనిపోయినా భయాందోళనలకు గురవుతున్నారు. ఏది ఏమైతేనేం జూలై నెల తమకు అచ్చురాలేదని, ఆగస్టు నెల నుంచి అంత శుభం జరుగాలని గ్రామస్తులు సకలదేవతలను ప్రార్థిస్తున్నారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్వీట్లు తినిపిస్తున్న దళిత సంఘం నాయకులు

# ఎస్సీ వర్గీకరణతో అట్టడుగు వర్గాలకు న్యాయం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, ఆగస్టు2(ప్రభాత ఉదయం) దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఎంతో సంతోషకరమని స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకురాలు లక్ష్మి రాజ్యం ఆధ్వర్యంలో దళిత సంఘం నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో తోడ్పాటునందించాయని దీంతో దళితుల్లో పేదలకు ఎంతో న్యాయం జరుగుతుందన్నారు.

# భూ తగాదాల్లో గాయపడ్డ వ్యక్తి

**అర ఎకర కోసం భగ్గుమన్న భూ తగాదాలు.. కర్రలతో దాడులు.**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2(ప్రభాత ఉదయం) తనకు రావలసిన అర ఎకర భూమి కోసం తమ్ముడు కుటుంబ సభ్యులపై అన్న కుటుంబ సభ్యులు దాడిచేసిన ఘటన గురువారం గట్టు మండలం అరగిద్ద గ్రామంలో చోటు చేసుకుంది. గట్టు ఎస్ఐ కేటి మల్లేష్ తెలిపిన వివరలా ప్రకారం అరగిద్ద గ్రామానికి చెందిన గోవిందునర్సమ్మ దంపతులకు తిమ్మప్ప, పెద్ద బతుకన్న, చిన్న బతుకన్న ముగ్గురు కుమారులు ఉన్నారు. గ్రామ శివారులో తన తండ్రి గోవిందు పేరున గల 5 ఎకరాల భూమిని తిమ్మప్ప, చిన్న బతుకన్న లు పంచుకోగా ఒక్కొక్కరికి 2.50 ఎకరాలు రాగ ఎవరి భూమి వారు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కుటుంబ అవసరాల నిమితం చిన్న బతుకన్న అర ఎకరా భూమిని తిమ్మప్పకి రూ.1.70 లక్షలకు విక్రయించాడు. అర ఎకర భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని చిన్న బతుకన్న ను పలు మార్లు తిమ్మప్ప కోరగా అదనంగా రూ.2లక్షలు ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని చిన్న బతుకన్న పెద్దల సమక్షంలో తెలియపరిచాడు. కొంతకాలం బతుకు దెరువు కోసం కర్ణాటక వెళ్లిన చిన్న బతుకన్న అతని భార్య రాములమ్మ స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన చిన్న బతుకన్న పై తిమ్మప్ప, అతని కుమారుడు జయన్న, నర్సింహులు, లోకులు, రాములు, పెద్ద బీచుపల్లి,హన్మంతు మరికొందరు కలిసి కర్రలతో, రాళ్లతో దాడి చేశారు. దీంతో అడ్డువచ్చిన బతుకన్న భార్య రాములమ్మ, తల్లి నర్సమ్మ పై కూడా దాడి చేశారు. ఈదాడులో చిన్న బతుకన్న కు తీవ్ర గాయాలు కాగ, అతని భార్య రాములమ్మకి గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బతుకన్న తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లేష్ వెల్లడించారు.






సీఎం రేవంత్ రెడ్డి సభకు బయలుదేరిన పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల వాహనానికి జెండా ఊపుతున్న కలెక్టర్ సంతోష్

## సీఎం ముఖాముఖి సభకు

# తరలిన ఉపాధ్యాయులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం) ఇటీవల పదోన్నతులు పొందిన ఉ పాధ్యాయులతో రాష్ట్ర సీఎం ఎ. రేవంత్ రెడ్డి ముఖాముఖీ కార్యక్రమానికి జిల్లా విద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు బయలుదేరేరారు. సీఎం రేవంత్ రెడ్డి సభకు బయలుదేరిన బస్సులను జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ జండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం హైదరాబాదులోని ఎల్బీ స్టేడియం లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖీ సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా విద్య శాఖ పరిధిలో మొత్తం 360 మంది ఉపాధ్యాయులు జిల్లా ఐ డి ఓ సి కార్యాలయం నుండి తొమ్మిది (9 ) ప్రత్యేక బస్సుల్లో అందరు హైదరాబాద్ కి వెళ్తున్నట్లు కలెక్టర్ బి .యం. సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ నర్సింగ రావు , జిల్లా విద్య శాఖ అధికారి ఇందిర, ఈ.డి ఎస్. సి రమేష్ బాబు, జిల్లా క్రీడా అధికారి బి.ఎస్ ఆనంద్, మండల విద్యాధికారి సురేష్, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# చట్టపరమైన రక్షణ ఉద్యోగలి భద్రత కల్పించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2(ప్రభాత ఉదయం)రవాణా రంగ కార్మికులకు చట్టపరమైన రక్షణ కల్పించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏ వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన రవాణా రంగా కార్మికుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 85% ప్రయాణికులను 65% వస్తువులను రోడ్డు రవాణా ద్వారా రవాణా రంగా కార్మికులు చేరవేస్తున్నారని కానీ వీరికి చట్టపరమైన రక్షణ గాని ఉద్యోగ భద్రత గాని లేదన్నారు దేశ జిడిపిలో రవాణా రంగం ద్వారా 4.5శాతం సమకూరుస్తున్న రవాణా రంగా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం గత దశాబ్ద కాలంగా ఎటువంటి సంక్షేమ పథకాలు చేపట్టకపోవడం దారుణం అన్నారు కార్మికులకు ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టకపోగా రవాణా రంగ కార్మికులకు తీవ్ర నష్టాన్ని తెచ్చే హిట్ అండ్ చట్టాన్ని తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మోటార్ వాహన.యాక్ట్ 2019 సవరణ చట్టాన్ని అమలు చేయబోమని బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోయిన రవాణా రంగ కార్మికులకు బీడీ నేత చేనేత కార్మికులకు ఇస్తున్నట్టుగానే నెలకు 4500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, ఈ సమావేశంలో రవాణా రంగ కార్మికులు శేక్షావలి చిన్న నరసింహ అశోక్ దేవరాజ్ ప్రభుదాస్ నాగేష్ అశోక్ బిచుపల్లి పరశురాముడు మధు తదితరులు పాల్గొన్నారు .

# దానం నాగేందర్ వెంటనే రాజీనామా చేయాలి

**మనుషులు మాట్లాడే భాష కాదు**

**పశువులు మాట్లాడే భాష..**

**దానం నాగేందర్ మాట్లాడిన భాష**

**సభ్య సమాజం తల దించుకునే విధంగా ఉన్నది..**

**రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు**

**పోరెడ్డి ధర్మారెడ్డి డిమాండ్**




రాజేంద్రనగర్,ఆగస్టు 02(ప్రభాత ఉదయం) ఎమ్మెల్యేలను శాసనసభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసభ్యపదజాలంతో దూషించడం పట్ల రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దానం నాగేంద్రంపై మండిపడ్డారు. సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ... సిగ్గు,శరం ఉంటే దానం నాగేందర్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.శుక్రవారం శాసన సభలో దానం నాగేందర్ మాట్లాడిన భాష సభ్య సమాజం తల దించుకునే విధంగా ఉన్నదని మండిపడ్డారు.పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారని..ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను దగ్గరుండి ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆరోపించారు.అసెంబ్లీ అంటే దేవాలయమని..అలాంటి దేవాలయంలో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని పోరెడ్డి ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దానం నాగేందర్ అసభ్య పదజాలంతో మాట్లాడటంపై ధ్వజమెత్తారు.సభా నాయకుడే సభలో ఉండి ఈరకంగా బీఆర్ఎస్ పార్టీని, ఎమ్మెల్యేలను తిట్టించే ప్రయత్నం చేయడం ఏరకంగా సమంజసమని ఆయన ప్రశ్నించారు.అది మనుషులు మాట్లాడే భాష కాదు పశువులు మాట్లాడే భాష అని దానం నాగేందర్‌పై పోరెడ్డి ధర్మారెడ్డి మండిపడ్డారు.

# కొత్తకోట మండల నూతన తహసిల్దారుగా వెంకటేశ్వర్లు

**బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు కు శుభాకాంక్షలు తెలియజేసిన**

**బి ఆర్ ఎస్ నాయకులు**

కొత్తకోట, ఆగస్టు2(ప్రభాత ఉదయం) కొత్తకోట మండల నూతన తహసిల్దార్ గా వెంకటేశ్వర్లు పదవి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మండల తాసిల్దార్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లను బి ఆర్ ఎస్ అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, యువనయకులు గాడిల నవీన్ లు మర్యాద పూర్వకంగా కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



కొత్తకోట మండల నూతన తాసిల్దార్ వెంకటేశ్వర్లు ను సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# విద్యుత్ సరఫరాలో అంతర్యం లేకుండా ప్రత్యేక చర్యలు

**ఏ డి ఈ ఈశ్వర్ ప్రసాద్**

రాజేంద్రనగర్, ఆగస్టు2(ప్రభాత ఉదయం) విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గగన్ పహాడ్ విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలోని కాటేదాన్ సెక్షన్ లో అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల నుండి సమస్యలు తెలుసుకొని పరిష్కారం పై చర్చించారు. ఈ సందర్భంగా ఏడీఈ ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్ వినియోగ దారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్తును అందించటానికి ప్రత్యేక దృష్టి సారించింది అన్నారు. సరఫరాలో అంతరాయం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వాటిని క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటారు అన్నారు.



ఏ డీ ఈ ఈశ్వర్ ప్రసాద్ తో మాట్లాడుతున్న స్థానిక నాయకులు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.